అర్హులు ఒక్క శాతమేనా?

తెల్ల రేషన్ కార్డుల పునఃపరిశీలనలో పునరుద్ధరించినవి 983 మాత్రమే..

- గతంలో రద్దు చేసిన రేషన్ కార్డుల సంఖ్య 95,040
- పునఃపరిశీలనలో 94,057 కార్డులు చెల్లుబాటు కావని అధికారుల నిర్ధారణ

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గతంలో వివిధ కారణాలతో రద్దయిన తెల్ల రేషన్ కార్డుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టిన జిల్లా పౌర సరఫరాల శాఖ అర్హత సాధించిన కార్డులు 983 మాత్రమేనని లెక్క తేల్చడంతో పునరుద్ధరణకు నోచుకోని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2016లో ప్రభుత్వ ఆదేశాల మేరకు అనర్హుల పేరుతో జిల్లాలో 95,040 తెల్ల రేషన్ కార్డులను జిల్లా పౌర సరఫరాల శాఖ తొలగించింది. సంబంధిత లబ్ధిదారులకు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా కార్డులను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ ఓ వ్యక్తి సుప్రీం కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశాడు. దీంతో కేసును పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని వివరణ కోరి పలు సూచనలు చేసింది. రద్దు చేసిన తెల్ల రేషన్ కార్డుల పునః పరిశీలనకు రద్దు చేసిన వారికి నోటీసులిచ్చి విచారణ చేయాలని సూచించింది.

పరిశీలన జరిగింది ఇలా..

రద్దు చేసిన కార్డులకు సంబంధించి లబ్ధిదారుల వివరాలను తెలుసుకొని నోటీసులు జారీ చేసిన జిల్లా పౌర సరఫరాల శాఖ తొలగించిన కార్డుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి విచారణ నిర్వహించింది. గతంలో కార్డులను రద్దు చేసేందుకు పేర్కొన్న వివిధ కారణాలకు మరోమారు విచారణ బృందం మళ్లీ పునః పరిశీలించింది. విచారణ బృందం పరిశీలనలో చనిపోయిన వారు, ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు, ఆధార్ సంఖ్య రెండు సార్లు నమోదైన వారు, గ్రామంలో లేకుండా పూర్తిగా వెళ్లిపోయిన వారు, నిబంధనలకు మించి భూములు కలిగి ఉన్న వారికి సంబంధించి రద్దయిన కార్డులు ఉన్నట్లయితే వాటిని మళ్లీ అనర్హతగా విచారణ బృందం పరిగణించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే పునః పరిశీలన తర్వాత జిల్లాలో 983 తెల్లరేషన్ కార్డులు మాత్రమే చెల్లుబాటు అయినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

గతంలో రద్దయిన కార్డులివే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 95,040 తెల్లరేషన్ కార్డులు రద్దు కాగా, మండలాలు, జీహెచ్ఎంసీ మున్సిపల్ సర్కిళ్ల వారీగా రద్దయిన తెల్ల రేషన్‌కార్డుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.



సర్కిళ్ల వారీగా...

జీహెచ్ఎంసీ సర్కిల్	రద్దయిన తెల్ల రేషన్ కార్డులు
ఉప్పల్	39,270
బాలానగర్	35,210

మండలాల వారీగా...

మండలం	రద్దయిన తెల్ల రేషన్ కార్డులు
బాచుపల్లి	2,378
ఘట్‌కేసర్	2,273
కాప్రా	2,263
కీసర	3,388
మేడ్చల్	2,306
మేడిపల్లి	4,165
శామీర్‌పేట్	893
మూడుచింతలపల్లి	328



గుండ్లపోచంపల్లిలోని ఓపెన్ వెంచర్

గేటెడ్ కమ్యూనిటీ కాదు..
ఓపెన్ వెంచర్

- ఓపెన్ వెంచర్‌ను గేటెడ్ కమ్యూనిటీగా మార్చిన ప్లాట్ల యజమానులు
- వెంచర్‌ను కొంత మంది తమ ఆధీనంలోకి తీసుకుని పెత్తనం చెలాయిస్తున్న వైనం
- తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటున్న ఇతర ప్లాట్ల యజమానులను

మేడ్చల్: గుండ్లపోచంపల్లిలోని ఓ వెంచర్‌లో అసోసియేషన్ సభ్యుల తీరుతో ప్లాట్ల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొన్నేళ్ల క్రితం వెంచర్ ఏర్పాటు చేసి 321 ప్లాట్లను విక్రయించారు. రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేసి మున్సిపాలిటీకి అప్పగించారు. వెంచర్‌లో 15 మంది కోట్ల రూపాయలతో భవనాలు నిర్మించుకొని నివాసముంటున్నారు. ఓపెన్ వెంచర్ కావడంతో రియల్ వ్యాపారులు ప్లాట్లు అమ్ముకుని తమ వ్యాపారం పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత ఇళ్లు నిర్మించుకున్న కొంత మంది దానిని అనధికార గేటెడ్ కమ్యూనిటీలా మార్చేశారు. అసోసియేషన్ ఏర్పాటు చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తూర్పు వైపు కండ్లకోయ రోడ్డును కలిపేవిధంగా గేట్ ఉండగా దానిని మూసివేశారు. పడమర వైపు సెక్యూరిటీ ఏర్పాటు చేసి లోపలికి ఎవరినీ అనుమతించడం లేదు. గుండ్లపోచంపల్లి రోడ్డు నుంచి కండ్లకోయ రోడ్డుకు వెళ్లే ఆస్కారం ఉన్నా అటు నుంచి ఎవరినీ వెళ్లనివ్వడం లేదు.

ప్లాటు అమ్మితే కమీషన్ ఇవ్వాల్సిందే..

వెంచర్‌లో అసోసియెషన్ పెత్తనం పెరగడంతో ప్లాట్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్లాటు అమ్ముకోవాలంటే అసోసియేషన్‌కు కొంత డబ్బు ఇవ్వాలని నిబంధనలు పెట్టి వసూళ్లు చేస్తున్నారు. దీంతో ప్లాట్ల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. ఓపెన్ వెంచర్‌లో అక్రమంగా అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని తమను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని యజమానులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి

వెంచర్‌ను గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకుని తమకు అన్ని వసతులు కల్పించాలని కోరుతూ పలువురు ప్లాట్ల యజమానులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మూసేసిన రోడ్లును తిరిగి ఓపెన్ చేయడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

చర్యలు తీసుకుంటాం

వెంచర్ విషయంలో కొంత మంది ఫిర్యాదు చేశారు. పూర్తిగా విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ఓపెన్ వెంచర్ అయితే దానిని మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకుని సౌకర్యాలు కల్పిస్తాం.

– రాములు, మున్సిపల్ కమిషనర్

సమాచారం

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా నేడు మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మునీరాబాద్ గ్రామం పరిధిలోని అన్ని ఫీడర్లకు, పరిశ్రమలకు, అగ్రికల్చర్ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



మేడ్చల్: మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో మల్లన్న గుడి నిర్మాణం కోసం గ్రామస్తులు భూమి పూజ చేశారు. జెడ్పీటీసీ శైలజారెడ్డి, సర్పంచ్ విజయానంద్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తుల సహకారంతో ఆలయ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూస్తానని జెడ్పీటీసీ శైలజారెడ్డి అన్నారు.

జీవో నం.58, 59 దరఖాస్తులపై నేడు అవగాహన

జవహర్‌నగర్: జీవో నంబర్ 58, 59 ప్రకారం దరఖాస్తులు చేసుకున్న వారి కోసం బుధవారం జవహర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి కీసర ఆర్డీవో రవి, కాప్రా మండల తహసీల్దార్ అనిత హాజరై నగదు చెల్లింపులపై సందేహాలను నివృత్తి చేయనున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు ఉదయం 9.30 గంటలకు జవహర్‌నగర్ తహసీల్దార్ మీటింగ్‌హాల్‌కు రావాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ తెలిపారు.

'సుకన్య సమృద్ధి యోజన'ను సద్వినియోగం చేసుకోండి

ఘట్‌కేసర్: సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ సికింద్రాబాద్ సబ్ డివిజన్ అధికారి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. ఘట్‌కేసర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 9, 10 తేదీల్లో పోస్టాఫీసుల్లో రూ.250తో ఖాతా తెరవాలని సూచించారు. ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఈ పథకంలో చేరితే వారి వివాహానికి ఆసరాగా ఉంటుందన్నారు. 15 ఏళ్ల పాటు నగదు చెల్లించాలని, మరో 6 సవత్సరాల తర్వాత వడ్డీతో పాటు చెల్లిస్తామన్నారు. పుట్టిన రోజు సర్టిఫికెట్‌తో పాటు తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, పాన్ కార్డు, రెండు ఫొటోలతో పోస్టాఫీస్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పొదుపు సంఘాల మహిళలకు అండగా ఉంటా

మేడ్చల్: గౌడవెల్లి గ్రామంలో పొదుపు సంఘాల మహిళలకు అండగా ఉంటూ వారికి అన్ని వసతులు కల్పిస్తామని గ్రామ సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధికార ప్రతినిధి సురేందర్‌ముదిరాజ్ అన్నారు. గ్రామంలోని డ్వాక్రా భవనాన్ని ఆయన పరిశీలించారు. డ్వాక్రా మహిళలు తడి పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతినెలా సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శాంతి, వార్డు సభ్యులు సదానంద్‌గౌడ్, రాజుగౌడ్, పొదుపు సంఘాల సభ్యులు పద్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



జవహర్‌నగర్: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాప్రా సాకేత్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి 40 నుంచి 45 సంవత్సరాల వయసు ఉంటుందని చెప్పారు. మూడు రోజుల నుంచి వైన్స్ వద్ద తిరుగుతున్నాడని, మద్యం మత్తులో ఇటుకలపై పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. ఆయా గ్రామాల్లోని ప్రజలకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లద్దాలు అందజేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రతి రోజూ కంటి వెలుగు శిబిరాలను పరిశీలించి ప్రజలకు ఎలాంటి అసౌర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

శామీర్‌పేట్: కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వైద్యనాథ్, కార్యదర్శి శోభారాణి, ఆశా వర్కర్ మంజుల, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన

ఘట్‌కేసర్: ప్రతి ఒక్కరూ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి సూచించారు. అవుషాపూర్‌లో కంటి వెలుగు–2 కార్యక్రమాన్ని మంగళవారం వారు పరిశీలించారు. గ్రామంలో 550 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 100 మందికి కళ్లద్దాలు అందజేశారు. రైతుబంధు జిల్లా సభ్యుడు భిక్షపతిగౌడ్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



కళ్లద్దాలు అందజేస్తున్న ఐలయ్య, కొండల్‌రెడ్డి

వైకుంఠధామంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

ఘట్‌కేసర్: వైకుంఠధామంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. మున్సిపాలిటీ 1వ వార్డులో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను వైస్ చైర్మన్ మాధవరెడ్డి, ఏఈ నరేశ్‌తో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వైకుంఠధామంలో మహిళలు, పురుషులకు వేర్వేరు స్నానం గదులు నిర్మించాలని, నీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

పరిశ్రమల్లో ప్రమాదాలపై కార్మికులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ వెంకట్‌రెడ్డి తదితరులు

మేడ్చల్‌రూరల్: తమ కంపెనీలో పనిచేసే కార్మికుల శ్రేయస్సుకు యాజమాన్యాలు చొరవ తీసుకోవాలని మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి సూచించారు. మేడ్చల్ పారిశ్రామికవాడలోని షీలా ఫోమ్ కంపెనీలో ప్రథమ చికిత్స, ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగినప్పుడు ఏం చేయాలనే దానిపై ఈఎంఆర్ఐ సహకారంతో పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదవశాత్తు కార్మికులు గాయపడితే చేయాల్సిన ప్రథమ చికిత్సల గురించి వివరించారు. మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి, పోలీస్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శామీర్‌పేట్: చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన సోమవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని పార్శిగుట్టకు చెందిన షేక్ జహంగీర్ (45) మరికొంత మందితో కలిసి సోమవారం శామీర్‌పేట పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో చేపలు పడుతున్న జహంగీర్ ఆ తర్వాత కనిపించలేదు. దీంతో అతడితో పాటు వచ్చిన వ్యక్తులు శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలోని అవుషాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అవుషాపూర్‌కు చెందిన ఎస్‌కే మౌలానా (43) దినసరి కూలీ. ఆదివారం రాత్రి మద్యంలో విషం కలుపుకొని తాగాడు. కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సోమవారం నాగారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి బంధువులు, స్థానికులు మౌలానా మరణంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

జవహర్‌నగర్: మహిళ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పులి నాగేంద్ర భార్య విజయభారతి (27), కుమార్తెతో కలిసి జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో నివాసముంటున్నాడు. సోమవారం తన కుమార్తె ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రికి వెళ్తున్నాని చెప్పి వెళ్లిన విజయభారతి తిరిగి ఇంటికి వచ్చింది. ఆ తర్వాత మరోసారి ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాగిశెట్టిపల్లిలో అదనపు కలెక్టర్ పర్యటన

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం నాగిశెట్టిపల్లి గ్రామాన్ని అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య మంగళవారం సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనం, డంపింగ్‌యార్డ్, వైకుంఠధామాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృపాకర్‌రెడ్డి, ఎంపీడీఓ రవినాయక్, కార్యదర్శులు సుచిత, శ్వేత పాల్గొన్నారు.



నాగిశెట్టిపల్లి నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి



పార్కు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: నగర శివారు ప్రాంతాల్లో ఉన్న మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కుందన్‌పల్లి ప్రజయ్‌సాయి గార్డెన్‌లో రూ.1.88 కోట్లతో చేపట్టనున్న పార్కు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. దీంతో పాటు రూ.23 లక్షలతో 13వ వార్డులోని చెరువు కట్ట అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దయాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నరేందర్‌గౌడ్, కమిషనర్ స్వామి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి జనార్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జనార్ధన్‌రెడ్డి తదితరులు

కీసర: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని భోగారం, రాంపల్లి, దమ్మాయిగూడ, కీసర ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం నేతలు శ్రీధర్, మల్లేశం, శ్రీనివాసరావ్, దేవేందర్, వెంకటరామ్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతా

మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లో మట్టి రోడ్డు కనిపించకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం రూ.4.7 కోట్ల వ్యయంతో చేపడుతున్న ప్రధాన రహదారి నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. జవహర్‌నగర్‌ను అద్భుతమైన పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే సుమారు రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని దశలవారీగా అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. చాలా రోజులుగా ప్రధాన రహదారితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకుడు కొండల్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

ఏడాది క్రితమే తీర్మాణం..

జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రధాన రహదారిని 100 అడుగులకు విస్తరించాలని గత ఏడాది తీర్మాణం చేయడంతో పాటు మార్కింగ్ సైతం చేశారు. ఆ తర్వాత రూ.8.25 కోట్ల వ్యయంతో హడావిడిగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడు. దాదాపు సంవత్సర కాలంగా రోడ్డంతా గుంతలమయమై దుకాణదారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ మండిపడ్డారు. మంగళవారం మంత్రి మల్లారెడ్డి పర్యటనను స్థానిక నాయకులతో కలిసి అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే భయంతోనే మంత్రి హడావిడిగా వచ్చి 100 అడుగులు చేయాల్సిన రోడ్డును కేవలం 40 అడుగులకే పరిమితం చేస్తున్నారని విమర్శించారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్, డిప్యూటీ మేయర్



కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీకాంత్‌యాదవ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చెరువుని కప్పేసిన గుర్రపు డెక్క



మేడ్చల్–గౌడవెల్లి రోడ్డులో ఉన్న కుంట పూర్తిగా గుర్రపు డెక్కతో నిండిపోయి చెరువు ఆనవాళ్లు కనిపించడం లేదు. గుర్రపు డెక్క ఎండిపోయి ఎడారిని తలపిస్తుంది. అపరిశుభ్రతకు నిలయంగా మారడంతో వాసన, దోమల బెడదతో సమీప కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. –మేడ్చల్